# చిట్టి కథ

- జెన్



## అల్జీమర్స్

అమ్మానాన్న..
తాతయ్య పుట్టినరోజును
మరిచిపోయారు.
వాళ్లకు అల్జీమర్స్ లేదు.
తాతయ్య..
అమ్మానాన్నల పెళ్లిరోజు
గుర్తుంచుకున్నాడు.
ఆయనకు అల్జీమర్స్ ఉంది.



## ఇద్దరు

కాలేజ్ మెస్.
తొలిరోజు.
ఒక డైనింగ్ టేబుల్.
ఇద్దరు అపరిచితులు.
ఇద్దరూ..
పప్పులో ఆవాలు
ఏరేస్తున్నారు.
ఇద్దరూ కలిసి..
స్ట్రాంగ్ కాఫీ
ఆర్డర్ ఇవ్వడానికి
ఎన్నో రోజులు పట్టలేదు.



## కన్నీళ్లు

‘నా భార్యతో కన్నీళ్లు పెట్టిస్తే..
చూస్తూ ఊరుకుంటానా?’
అంటూ ఆవేశంగా..
పదునైన కత్తితో ముక్కలు ముక్కలుగా
కోసేశాడు.
ఉద్వేగంగా భర్తను
చుట్టేసుకుంది కొత్త పెళ్లాం!
ముసిముసిగా నవ్వుకున్నాయి..
ఉల్లిపాయ ముక్కలు.



## నేనెవరు?

ఏదో వెబ్‌సైట్
ఓపెన్ చేస్తున్నప్పుడు..
‘I AM NOT A ROBOT’
అనే కండిషన్ మీద
క్లిక్ చేయడానికి ఆమె
మనసు అంగీకరించలేదు.
పక్కనే..
తన ప్రమేయం లేకుండా
నలిగిపోయిన బెడ్‌షీట్.
అప్పుడే..
అటు తిరిగి పడుకున్న భర్త.



## లాయర్

అద్భుతంగా వాదించి..
రేప్ కేసు నుంచి
పొలిటీషియన్ కొడుకును
తప్పించింది.
లాయర్‌గా గెలిచినా
మహిళగా ఓడింది.